ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | 5



పిఠాపురంలో నేటి నుంచి కుంతీమాధవుని కల్యాణోత్సవాలు
అంతర్వేదిలో వైభవంగా గ్రామోత్సవాలు
గొల్లప్రోలులో ఆకట్టుకున్న నాటికలు

సాయానికీ.. సాగదీత



మిచౌంగ్ తుఫానుతో గొల్లప్రోలులో దెబ్బతిన్న వరి(ఫైల్)

- జిల్లాలో మిచౌంగ్ తుఫాను నష్టపరిహారం కోసం అన్నదాతల ఎదురుచూపులు
- దాదాపు రెండున్నర నెలలు దాటిపోయినా ఉలుకుపలుకూ లేని జగన్ సర్కారు
- జిల్లాలో 34వేల ఎకరాల్లో 27,980మంది రైతులకు పంట నష్టం నమోదు
- రూ.21.98కోట్లు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోకుండా కాలయాపన
- పరిహారం ఇవ్వకుండా ఏడిపిస్తున్న సర్కారు తీరుపై అన్నదాతల్లో ఆగ్రహం
- అసలే 80వేల ఎకరాలకుపైగా పంట నష్టపోతే అడ్డదిడ్డంగా సాయానికి కోతలు
- అటు ఉద్యాన రైతుల పరిస్థితీ అంతే: రూ.3కోట్ల వరకు పరిహారం అందని వైనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

తమది రైతు ప్రభుత్వం అంటూ పదేపదే గొప్పలు చెప్పే జగన్ సర్కారు ఆచరణలో మాత్రం జిల్లాలో అన్నదాతలకు చుక్కలు చూపిస్తోంది. మిచౌంగ్ తుఫాను కారణంగా పంట నష్టంతో రోడ్డునపడ్డ రైతులను ఆదుకోకుండా ఏడిపిస్తోంది. పంటలు దెబ్బతిని నెలలు గడుస్తున్నా రూ.21.98కోట్ల పరిహారం ఇవ్వకుండా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తోంది. దీంతో అన్నదాతలు ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం లెక్కింపులో అడ్డంగా కోతలు కోసేసి అందించే తక్కువ సాయానికి కూడా ఇంత జాప్యం ఏంటంటూ మండిపడుతున్నారు. ఒకపక్క ఏటా ధాన్యం కొనుగోలుకు డబ్బులు సకాలంలో ఇవ్వకుండా ఏడిపిస్తున్న ప్రభుత్వం చివరకు పంటనష్టం సాయం అందించడానికి కూడా ఇంతలా ఇబ్బంది పెడుతుండడంతో ధ్వజమెత్తుతున్నారు. మరోపక్క ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రచార లబ్ధి కోసమే జాప్యం చేసి దగ్గర్లో జమ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందా? అనే అనుమానాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

సర్వం కొట్టుకుపోయింది..

గతేడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాను కారణంగా 5వతేదీ నుంచి కురిసిన భారీవర్షాలకు జిల్లావ్యాప్తంగా వరిపంటలు పూర్తిగా నీట మునిగాయి. కోతకు వచ్చిన చేలు ఎక్కడికక్కడ మునిగిపోయాయి. రోజుల తరబడి నీటిలో నానడంతో కుళ్లిపోయాయి. కోత కోసిన వరి ఎక్కడికక్కడ కొట్టుకుపోయింది. కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు కళ్లముందే నీటమునిగి కొట్టుకుపోయాయి. వరికుప్పల్లోకి భారీగా నీరు చేరి పనలు కుళ్లిపోయి మొలకలు వచ్చేశాయి. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 80వేల ఎకరాలకు పైగా వరిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో అన్నదాతలు నిలువునా నష్టపోయారు. అప్పులు చేసి పంట సాగు చేస్తే తీరా పంట చేతికి వచ్చే సమయంలో దెబ్బ తినడంతో లబోదిబోమన్నారు. పంటలు దెబ్బతిన్న వారం తర్వాత తీరిగ్గా ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా వ్యవసాయశాఖ పంట నష్టం అంచనాకు రంగంలోకి దిగింది. అప్పటికే పనలు, చేలు కుళ్లిపోయి నామరూపాలు లేకుండా పోయాయి. కానీ ఇదంతా ఉన్నది ఉన్నట్లు నష్టం కింద నమోదు చేస్తే ప్రభుత్వానికి ఆర్థిక భారం పెరిగిపోతుందనే కారణంతో సర్కారు ఒత్తిడితో అధికారులు ఎక్కడికక్కడ నష్టం అంచనాల్లో కోత కోసేశారు. మొత్తం నష్టంలో సగం కూడా గుర్తించలేదు. పైపైనే 20 మండలాల్లో నష్టం నమోదు మమ అనిపించేశారు. ఇందులోభాగంగా 80వేల ఎకరాలకుపైగా పంట నష్టపోతే చివరకు అడ్డదిడ్డంగా కోతలు కోసి 34వేల ఎకరాలకు మాత్రమే పరిమితం చేశారు. తద్వారా జిల్లావ్యాప్తంగా 27,980మంది రైతులే నష్టపోయినట్లు గుర్తించారు. వీరందరికీ పంట నష్టపరిహారం కింద రూ.21.98కోట్లు చెల్లించాలని లెక్క తేల్చారు. ఈ మేరకు అప్పట్లో ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇది జరిగి దాదాపు రెండున్నర నెలలు దాటుతోంది. కానీ ఇంతవరకు జగన్ ప్రభుత్వం మాత్రం రైతులకు పరిహారం జమచేయలేదు. అసలు ఎప్పుడు ఖాతాల్లో పరిహారం పడుతుందో కూడా అధికారులు సమాధానం చెప్పడంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీరుపై అన్నదాతలు లబోదిబోమంటున్నారు. అందించే పిసరంత సాయానికి ఇంత జాప్యమేంటంటూ మండిపడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఏటా ఖరీఫ్, రబీ ధాన్యం కొనుగోలుకు సంబంధించి డబ్బులు సకాలంలో చెల్లించడంలేదు. దీంతో నెలల తరబడి బాకీల కోసం అన్నదాతలు ఎదురు చూడాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి.

చాలామంది రైతులైతే ప్రభుత్వం ధాన్యం బకాయిలు ఎప్పుడు చెల్లిస్తుందో తెలియక దళారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ఇప్పుడు చివరకు పంట నష్టపరిహారం చెల్లింపులు కూడా తీవ్ర జాప్యం అవడంతో మండిపడుతున్నారు. మరోపక్క జిల్లావ్యాప్తంగా మిచౌంగ్ తుఫాను ధాటికి వేల ఎకరాల్లో దాదాపు 14 రకాల వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వీటికి కూడా రూ.3కోట్ల వరకు పరిహారం అందాల్సి ఉంది. అవి కూడా ఇప్పటికీ రైతులకు జమకాలేదు. మరోపక్క ఏ క్షణమైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే అప్పుడు చెల్లింపులకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. కానీ ప్రభుత్వం కావాలనే పరిహారం చెల్లింపులు ఆలస్యం చేస్తోందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పరిహారం ఇప్పుడు జమ చేయకుండా ఆలస్యం చేసి ఎన్నికలు ఇంకా దగ్గరకు వచ్చినప్పుడు జమ చేస్తే ఓట్లపరంగా లబ్ధి జరుగుతుందనే ఆలోచనతోనే ప్రభుత్వం జాప్యం చేస్తోందనే అనుమానాలను అన్నదాతలు వ్యక్తం చేస్తున్నారు.

టిక్కెట్ ప్లీజ్..!!

- జిల్లాలో కాంగ్రెస్ ఆశావాహుల దరఖాస్తులు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 17: ఏపీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల పగ్గాలు చేపట్టిన నాటి నుంచి కాకినాడ జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నిండింది. రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిక్కెట్ ప్లీజ్ అంటూ.. కాంగ్రెస్ ఆశావాహులు పీసీసీ కార్యాలయానికి క్యూకడుతున్నారు. రాష్ట్ర విభజన ప్రభావంతో ఆంధ్ర రాష్ట్రంలో తుడుచుపెట్టుకుపోయి పదేళ్లు అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీకి మళ్లీ ఇటీవల కాస్త ఉత్తేజం వచ్చింది. 2019 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే జిల్లాలో ఈసారి కాంగ్రెస్ టిక్కెట్లు ఆశిస్తున్న వారిసంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే విజయవాడలోని ఆంధ్రరత్న భవన్ పీసీసీ కార్యాలయంలో జిల్లా నుంచి పలువురు ఆశావాహులు టిక్కెట్ ధరావత్తు చెల్లించి దరఖాస్తులు చేసుకుంటున్నారు. పార్లమెంట్ స్థానానికి జనరల్ కేటగిరీ రూ.25వేలు, రిజర్వ్‌డ్ కేటగిరీ రూ.10వేలు, అసెంబ్లీ స్థానానికి జనరల్ కేటగిరీ రూ.10వేలు, రిజర్వ్‌డ్ కేటగిరీ రూ.5వేలుగా ధరావత్తు నిర్ణయించారు. పార్టీ శ్రేణులనుంచి తాకిడి పెరుగుతుండడంతో ఈనెల 10వతేదీతో ముగిసిన దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 29వతేదీ వరకు పొడిగించారు. కాకినాడ పార్లమెంట్‌స్థానంనుంచి మాజీ కేంద్రమంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు బాబాయ్ మల్లిపూడి రాంబాబు తిరిగి పోటీ చేసేందుకు ఖరారైనట్లుగా సమాచారం. కాకినాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు మరొక నాయకుడు దరఖాస్తు చేసుకున్నారు. తునిఅసెంబ్లీ నియోజకవర్గంనుంచి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు పోటీ చేయనున్నట్లు తెలిసింది. మొత్తంగా ఇప్పటివరకు ఏడు అసెంబ్లీ స్థానాలకు 20మంది వరకు ఆశావాహులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 26వతేదీ మంచి రోజు కావడంతో కొందరు ఆశావహులు వేచి చూస్తున్నారు. కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గం, కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గంనుంచి టిక్కెట్ ఆశిస్తున్న నాయకుల సంఖ్య ఎక్కువగాఉంది. గెలుపు సంగతి పక్కన పెడితే జాతీయపార్టీ నుంచి పోటీ చేస్తే గుర్తింపు ఉంటుందని భావిస్తున్నారు. త్వరలో కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకటించే సభకు అతిథులుగా హాజరుకానున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధారామయ్య ఆంధ్రలో ఎన్నికల ప్రచారం సాగిస్తారనే చర్చ నడుస్తోంది.



కాకినాడ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన జరుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 20న కాకినాడలో మహాధర్నా

- ఏపీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ రామ్మోహనరావు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 17: ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వంనుంచి స్పందన లేనందున, వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 20న కాకినాడలో తలపెట్టిన మహాధర్నా, ర్యాలీకి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వశాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఏపీ జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ గుద్దటి రామ్మోహన్‌రావు విజ్ఞప్తి చేశారు.ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంకోసం ఏపీ జేఏసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ తాలూకా ఆధ్వర్యంలో చేస్తున్న ఉమ్మడి కార్యాచరణలో భాగంగా శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పెన్షనర్లు నగరంలో బైక్ ర్యాలీ, కాకినాడ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకురావాల్సిన ఎస్ఎల్, జీపీఎఫ్ లోన్స్, ఏపీ జీఎల్ఐ, డీఏ బకాయిలు విడుదల చేయాలని, 12వ పీఆర్సీ 30శాతం, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీఎన్జీవో సంఘం జిల్లా కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, ఆర్అండ్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు మునికేషులు, ట్రెజరీ సంఘం అధ్యక్షుడు పాము శ్రీనివాస్, జడ్పీ సంఘం అధ్యక్షుడు ఆర్వీ రమేష్, ఎస్టీయూనుంచి మోర్త శ్రీనివాస్, బి.మహేష్, యూటీఎఫ్‌నుంచి నగేష్, గోవిందరాజులు, పీఆర్టీయూనుంచి ప్రదీప్, జిల్లా ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కేవీఎస్‌వీ ప్రసాద్, కార్య నిర్వాహక కార్యదర్శి డి.డేవిడ్ ఎలియాజర్, కాకినాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తిరాజు, రామకృష్ణ, స్టేట్ కౌన్సిలర్ అజీజ్, సీపీఎస్ సంఘ అధ్యక్షుడు బాషా పాల్గొన్నారు.

మళ్లీ బాదుడు



- మున్సిపాల్టీల్లో భారీగా పెరగనున్న ఆస్తిపన్ను
- వరుసగా మూడో సారి పెంపు
- పెరిగిన పన్నులు ఏప్రిల్ ఒకటి నుంచి వసూలు
- ప్రజలనుంచి వ్యతిరేకత వస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 17: ప్రభుత్వం పురపౌరులపై మరోసారి ఆర్థిక భారం మోపనుంది. ప్రభుత్వం బాదుడే బాదుడు అన్న నినాదాన్ని అమలు చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. చెత్త పన్నుకు తోడు ఆస్తిపన్ను పెంపుదలపై పట్టణవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా వీరి మొర ఆలకించే వారే లేరు. జిల్లాలోని కాకినాడ నగరపాలక సంస్థలు, ఇతర మున్సిపాల్టీల పరిధిలోని ఆస్తిపన్ను పెంచేందుకు రంగం సిద్ధమైంది.

హద్దూ.. అదుపూ లేకుండా..

ఆస్తి పన్ను పెరుగుదలకు హద్దూ.. అదుపూ లేకుండా పోతోంది. ప్రజల జేబును ఎన్నివిధాలుగా ఖాళీ చేయవచ్చో మున్సిపాల్టీల్లో నూతన ఆస్తిపన్ను విధానం తెలియజేస్తోంది. ప్రస్తుతం ఉన్న పన్ను మరో 15శాతం పెరగనుంది. పెరిగిన ఆస్తిపన్ను ఏప్రిల్ 1వతేదీ నుంచి అమల్లోకి రానుంది. గత టీడీపీ ప్రభుత్వహయాంలో మున్సిపాల్టీల్లో ఉన్న పన్ను విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చేసింది. ఆస్తి మార్కెట్ విలువను బట్టి(రిజిస్ట్రేషన్ విలువ) పన్నును విధిస్తుంది. దీని ప్రకారం ఆస్తి విలువను మార్కెట్ విలువ ప్రకారం మదింపు చేసి దాని ఆధారంగా ఆస్తిపన్ను విధిస్తున్నారు. గతంలో అద్దె విలువ, మున్సిపాల్టీల్లో జోన్లవారీగా విభజించి ఆస్తిపన్ను విధించేవారు. భవన నిర్మాణ కొలతలను పన్ను విధింపులో పరిగణనలోకి తీసుకునేవారు. గతంలో భవనానికిమాత్రమే పన్ను విధించేవారు. 1997నుంచి అమల్లోఉన్న దీన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చేసింది. కొత్త విధానంలో భవనంతోపాటు, భవనం నిర్మించిన స్థలం, చుట్టూ ఖాళీ వదిలితే దానికి పన్నువిధిస్తున్నారు. ఆస్తి విలువ ఆధారంగా విధిస్తున్న పన్ను ఏటా పెరుగుతుంది. క్యాపిటల్ వాల్యూ ప్రకారం పన్ను నిర్ణయించిన సమయంలో గతంలో చెల్లిస్తున్న పన్నుకు కొత్త విధానంలో నిర్ణయించి పన్నుకు మధ్య వ్యత్యాసాన్ని నిర్ధారిస్తారు. తేడా ఉన్న పన్ను ఏటా 15శాతం పెరుగుతుంది. మార్కెట్ విలువకు సమానమయ్యే వరకు పన్ను ఆ మాదిరిగా పెరుగుతూనే ఉంటుంది.

తగ్గేదేలే అన్న రీతిన..

జిల్లాలోని కాకినాడ కార్పొరేషన్ పౌరులపై దాదాపు రూ.2.50కోట్ల ఆస్తిపన్ను భారం పడనుంది. ఆస్తిపన్ను విషయంలో ప్రభుత్వం తీరు తగ్గేదేలే అన్న రీతిన ఉంది. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పన్ను డిమాండ్ రూ.38కోట్లు. ఈ ప్రకారం 15శాతం పన్ను పెరగడంతో మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయం రూ.2.50కోట్లు వరకు పెరగనున్నట్లు అధికారులు అంచనావేస్తున్నారు. ఈ పెరిగిన పన్నులను ఏప్రిల్ నుంచి వసూలు చేయనున్నారు.ఆ ప్రకారమే యజమానులకు రశీదులు అందనున్నాయి.

కోటి శివ లింగాలతో రుద్రాభిషేకం

- చంద్రబాబును ఆహ్వానించిన జ్యోతుల నెహ్రూ



బాబుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న నెహ్రూ

అమరావతి/జగ్గంపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటి శివ లింగాలతో జరిగే రుద్రాభిషేకానికి టీడీపీ అధినేత చంద్ర బాబునాయుడును ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి జ్యోతుల నెహ్రూ ఆహ్వానించారు. కోటి మట్టిలింగాలతో కోటి పార్థివలింగ మహా రుద్రాభిషేకం పేరుతో దీన్ని నిర్వహిస్తున్నారు. ఇర్రిపాక గ్రామంలో ఈ నెల 26వతేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకూ 11 రోజులపాటు ఇది జరగనుంది. దీని కోసం మట్టితో శివలింగాలను తయారు చేస్తున్నారు. శనివారం ఇక్కడ చంద్రబాబు నివాసంలో ఆయన్ను కలిసిన నెహ్రూ ఈ కార్యక్రమం గురించి వివరించి దానికి రావాలని కోరారు.

జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ విఠల్

జీజీహెచ్(కాకినాడ), ఫిబ్రవరి 17: కాకినాడ జీజీహెచ్ ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎంపీఆర్ విఠల్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ లావణ్యకుమారి నెల రోజులు సెలవుపై వెళ్లడంతో డాక్టర్ విఠల్‌కు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు అప్పగిస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్థో విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ విఠల్ సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ విఠల్‌ను డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో, డాక్టర్ రాహుల్, మినిస్టీరియల్ సంఘ నాయకులు పాలపర్తి మూర్తిబాబు, పేపకాయల కృష్ణ అభినందించారు.

వేలంకలో సొసైటీ అధికారులను.. నిర్బంధించిన రైతులు

కిర్లంపూడి, ఫిబ్రవరి 17: వేలంకలో బాకీల వసూళ్లకోసం వచ్చిన సొసైటీ అధికారులను రైతులు నిర్బంధించారు. కిర్లంపూడి సొసైటీలో జరిగిన అవకతవకలపై అధికారులు సరైన చర్యలు తీసుకోకపోగా చిన్న, సన్నకారు రైతులమైన తమను బాకీలు కట్టాలని ఒత్తిడి చేయడంపట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిర్లంపూడి సొసైటీలో అప్పులు తీసుకోకపోయినప్పటికీ సొసైటీలో సభ్యత్వం ఉంటే లక్ష రూపాయలు చొప్పున ప్రతిఒక్క రైతుపైనా మోపారని వారు ఆరోపించారు. కిర్లంపూడి మండలంలోని వేలంక గ్రామంలో ప్రత్తిపాడు సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ పోసిన రమణబాబు, కిర్లంపూడి సీఈవో సమితి వీరభద్రరావు, సూపర్‌వైజర్ కొండబాబు, దొడ్డిపట్ల నారాయణరావు తదితర సొసైటీ అధికారులను రైతులు నిర్బంధించారు. అదే గ్రామానికి శెట్టిమంగయ్య అనే రైతు కాకినాడ స్పందనలో నో అబ్జక్షన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే వాటి పరిశీలన కోసం రైతు వద్దకు వెళ్లి బాకీ చెల్లించాలని ఒత్తిడి చేశారు. బాకీలు కట్టినప్పటికీ ఉన్నట్లు చూపిస్తున్నారని, 20మంది రైతుల వరకు రశీదులు ఇవ్వలేదని రైతులు అధికారులను నిలదీశారు. కోట్లాది రూపాయలు కుంభకోణం జరిగితే చేసిన వారిని వదిలిపెట్టి చిన్న, సన్నకారు రైతుల భూములు జప్తు చేస్తామని హెచ్చరించడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ కుంభకోణంపై దర్యాప్తు జరుగుతోందని చెప్పడమే తప్ప దానికి పాల్పడిన వ్యక్తుల నుంచి సొమ్ములు ఇప్పటివరకు రికవరీ చేయకపోవడంపట్లవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు అవకతవకలకు పాల్పడిన వ్యక్తుల నుంచి సొమ్ములు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్బంధం సమాచారం తెలుసుకున్న కిర్లంపూడి పోలీసులు అక్కడకు వచ్చి వారిని తీసుకెళ్లారు.



తుని మండలం లోవకొత్తూరులో జగనన్న లే అవుట్

పేదలా.. పెద్దలా!!

- జగనన్న కాలనీలో అంతుచిక్కని ప్రశ్నలు
- 'రియల్' మాయాజాలంలో పేదల గృహాలు!
- లే అవుట్‌ల్లో బహుళ అంతస్తుల భవనాలు
- పేదలనుంచి చేజారుతున్న కాలనీలు

తుని రూరల్, ఫిబ్రవరి 17: పేదలకు చెందాల్సిన జగనన్న కాలనీలు పెద్దలకు చిక్కి బహుళ అంతస్తుల భవనాలుగా మారుతున్నాయి. ప్రతి పేదవాడు సొంతిల్లు కలిగి ఉండాలని ప్రభుత్వం జగనన్న కాలనీలు పేరుతో ఇళ్లస్థలాలు కేటాయించింది. తుని పట్టణ పరిధిలో 30 వార్డులు, తుని మండలంలో 25 గ్రామ పంచాయతీలు, కోటనందూరు, తొండంగి మండలాల్లో కలిపి 17వేల పైబడి ఇళ్లస్థలాలు సిద్ధం చేసి లబ్ధిదారులకు కేటాయించింది. ఇదే అదునుగా కొంతమంది అధికార పార్టీకి చెందిన రియల్ ఎస్టేట్ బ్రోకర్ల దందాతో పేదల స్థలాలు పెద్దల పరం అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కష్టాల్లో ఉన్న పేదలకు డబ్బులు ఆశ చూపి ఇళ్ల స్థలాలను తమ కబంధహస్తాల్లోకి కొందరు పెద్దలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వీరి జోరు మరింత ఎక్కువైంది.

డబ్బు ఆశలు చూపి..

జగనన్న కాలనీలో ఏం జరుగుతుందో అనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్లాట్ పక్కన ప్లాట్ కొనుగోలు, బహుళ అంతస్తుల బిల్డింగ్‌లు, రోడ్డును అనుకుని ఉన్న స్థలాల్లో వసూళ్లు వంటివి జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది. బహుళ అంతస్తుల బిల్డింగ్, కమర్షియల్ నిర్మాణానికి షాపుల నిర్మాణం జరుపుతున్న వీరికి గృహనిర్మాణశాఖ నుంచి బిల్లులు మంజూరు కావడం గమనార్హం. తుని పట్టణానికి సంబంధించి రాజుపేట సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో ప్లాట్లు చకచకా చేతులు మారుతున్నాయి. రియల్‌ఎస్టేట్ బ్రోకర్లు పేదలకు డబ్బు ఆశలు చూపి ప్రభుత్వంనుంచి అందుతున్న రూ.1.80లక్షలు హౌసింగ్ స్కీమ్‌తోపాటు ఇళ్ల స్థలాలు కారు చౌకగా తీసుకుని వాటిలో నిర్మాణం చేపట్టి మారుబేరాలు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. అధికారులు చర్యలు చేపట్టి పేదలకు అందాల్సిన స్థలాలు వారికే దక్కేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అందని సాగునీరు.. ఎండుతున్న చేలు

తాళ్లరేవు, ఫిబ్రవరి 17: చొల్లంగి ఏరియాలో సాగునీరు అందక పంటచేలు ఎండుతున్నాయని రైతులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. సాగునీరందక 150 ఎకరాలు బీడుగా వదిలేసినా మరో 150ఎకరాలు పొలాలకు నీరు అందించలేకపోతున్నారని, దీంతో ఆ చేలు ఎండుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. సాగునీరు కాలువకు వచ్చి 15రోజులు అవుతుందని, పోటుకు ఉప్పునీరు కాలువకు ఎక్కేసి పంటచేలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తాళ్లరేవు మండలం చొల్లంగిలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటచేలు

సాగునీటి ఎద్దడి నివారించకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- సామర్లకోట మండలం వీకే రాయపురంవద్ద రహదారిపై రైతుల నిరసనలు
- పురుగుమందు డబ్బాలతో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరిక

- మెయిన్‌లో

అంతర్వేదిలో వైభవంగా గ్రామోత్సవాలు

పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం





- గరుడ పుష్పక వాహనంపై ఊరేగిన స్వామివారు
- బ్రహ్మరథం పట్టిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు అంతర్వేదిపాలెం వాస్తవ్యులు రుద్రరాజు బంగారమ్మ వారిచే నిర్మించిన గురుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిపారు. తొలుత స్వామివారిని అర్చక స్వాములు అలంకరణ చేసిన అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు పట్టారు. గ్రామ పురవీధుల్లో స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు అప్పనపల్లి వాస్తవ్యులు దంతుకుర్తి శివసుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కుమార రామగోపాలరాజా బహద్దూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, వలవల రాంబాబు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావు (దత్తుడు), పోతురాజు వెంకటకృష్ణ, ఎస్‌ఐ ఎస్.రాము, అర్చకులు, వాహనకారులు పాల్గొన్నారు.

వన్‌వే రూట్ ఏర్పాటు



కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన దృశ్యం

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన స్వామివారి కల్యాణం, రథోత్సవాల రోజుల్లో వన్‌వే రూటు తప్పనిసరిగా కొనసాగించాలని సీఐ గోవిందరాజు అన్నారు. 19, 20 తేదీల్లో స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తులందరూ అంతర్వేదిపాలెం, కేశవదాసుపాలెం, అంతర్వేది మీదుగా దేవస్థానం గుడికి చేరుకోవాలని, స్వామి కల్యాణం తిలకించి దర్శనం చేసుకున్న భక్తులు ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తూ అంతర్వేది ఏటిగట్టు నుంచి గొంది, గుడిమూల మీదుగా సఖినేటిపల్లి నుంచి సురక్షితంగా వెళ్లాలన్నారు. సఖినేటిపల్లి మండలంలో ఉన్న ప్రజలంతా వన్‌వే రూటుకు ఎదురు వెళ్లరాదని, పది రోజుల ఉత్సవాల్లో వన్‌వే రూటు పాటిస్తూ 19, 20 తేదీల్లో మాత్రం స్థానిక ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.రాము తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవాల్లో నేటి కార్యక్రమాలు

అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 7 గంటలకు ఆర్జిత అభిషేకం, అనంతరం సాధారణ, ప్రత్యేక దర్శనాలు, సాయంత్రం 4 గంటలకు హంస వాహనం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహరణ, రాత్రి 7 గంటలకు శేషవాహనాలపై స్వామి వారి గ్రామోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. భక్తులు తరలివచ్చి స్వామివారి సేవలో తరించాలని కోరారు.

హైకోర్టు జస్టిస్ పూజలు



అంతర్వేది, ఫిబ్రవరి 17: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఏపీ హైకోర్టు జస్టిస్ టి.మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా శనివారం విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని ఏసీ సత్యనారాయణ వారికి అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎస్.రాము, తహసీల్దార్ పెద్దిరాజు, డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బంధాల విలువలు తెలిసేలా..

ఆకట్టుకున్న నాటికలు



అమృతహస్తం నాటికలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 17: కుటుంబ సంబంధ బాంధవ్యాలు, భార్యాభర్తలు, అన్నాచెల్లెల అనుబంధం విశిష్టతను చాటిచెబుతూ ప్రదర్శించిన నాటికలు అందరినీ ఆలోచింపజేశాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళావేదికపై తొలిరోజు ప్రదర్శించిన నాటికలు సందేశాత్మకంగా సాగాయి. ఆధునిక సమాజం సంబంధ బాంధవ్యాలు దూరమవుతున్న తరుణంలో అన్నాచెల్లెల అనుబంధం గొప్పతనాన్ని చాటుతూ అమృతహస్తం నాటికను ప్రదర్శించారు. అన్నాచెల్లెల మధ్య అప్యాయత, అనురాగాలను చక్కగా వివరించారు. చెల్లెలి వివాహ జీవితం ఇబ్బందుల్లో పడి ఆమె భర్త వేధిస్తుంటే తన ఇంటికి తీసుకువచ్చి చూసుకోవడం, అన్న, చెల్లెలు కలిసి బావకు బుద్ధిచెప్పడం ఇతివృత్తంగా నాటిక సాగింది. గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా, ఏపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. మనిషి జీవితం బంధంతో మొదలవుతుందంటూ అందులోని గొప్పతనాన్ని చాటిచెబుతూ ప్రదర్శించిన బంధం నాటిక సందేశాత్మకంగా సాగింది. తల్లిదండ్రులు, తోడబుట్టిన వాళ్లు, మిత్రులు, గురువులు, శ్రేయోభిలాషులు, పెళ్లి తర్వాత భార్యాభర్తలు, బిడ్డలు ఇలా ఎన్నో బంధాలు జీవిత చరమాంకం వరకూ ఉంటాయి. ఇందులో భార్యా భర్తల బంధం విశిష్టమయినది. ఎన్ని అవాంతరాలు ఎదురయినా పటిష్టంగా ఉండాలి తప్ప దారి తప్పిన ఆలోచనలతో దానిని విచ్ఛిన్నం చేసుకుంటే వచ్చే ఇబ్బందులను ఈ నాటిక ద్వారా తెలియజెప్పారు. విజయవాడ మైత్రి కళానిలయం కళాకారులు ప్రదర్శించిన ఈ నాటికను మాడుగుల రామకృష్ణ రచించగా, టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట




వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 17: కోనసీమ తిరుమల వాడపల్లి గోవిందనామస్మరణతో మార్మోగింది. శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామున సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగంను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరు వీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేసి తలనీలాలు, తులభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.44.90 లక్షలు లభించినట్టు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, డిప్యూటీ కమిషనర్, ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిశోర్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి కుంతీమాధవుని కల్యాణోత్సవాలు



పిఠాపురం, ఫిబ్రవరి 17: దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒక్కటైన కాకినాడ జిల్లా పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయం కల్యాణోత్సవాలకు సిద్ధమైంది. ఇంద్రుడు దేశంలో అయిదు ప్రాంతాల్లో మాధవ క్షేత్రాలను ప్రతిష్ఠించగా అందులో పిఠాపురం ఒక్కటని, పాండవుల తల్లి కుంతీదేవితో పూజలు అందుకుని కుంతీమాధవుడిగా విరాజిల్లుతున్నట్లు పండితులు చెబుతారు. కుంతీమాధవుని దివ్య కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమవుతాయి. ఈ ఉత్సవాలు 25వ తేదీ వరకూ జరగనున్నాయి. 18న ఉదయం పంచామృతాభిషేకం, రాత్రి ధ్వజారోహణం, విష్వక్సేనుల వారి గ్రామోత్సవం, 19న చక్రపెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామి ఉత్సవులకు అలంకార తిరుమంజనం, కల్యాణాలంకారం, 20న పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, సాయంత్రం గజవాహనంపై గ్రామోత్సవం, రాత్రి స్వామి కల్యాణం, 21న ఉదయం, సాయంత్రం శేష, గరుడ వాహనాలపై గ్రామోత్సవం, 22న పొన్నవాహనంపై గ్రామోత్సవం, 23వ తేదీ రాత్రి రథోత్సవం, 24న ఉప్పాడ సముద్రం వద్ద స్వామికి చక్రస్నానం, అన్నసమారాధన, రాత్రి ఆలయంలో చోర సంవాదం, 25వ తేదీన పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు, రాత్రి శ్రీపుష్పయాగం జరుగుతాయి. ప్రతిరోజూ వేద పారాయణం జరుగుతుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు, కుంతీ మాధవ భక్తబృందం సభ్యులు తెలిపారు.

22న రత్నగిరిపై సరస్వతి పూజ

అన్నవరం, ఫిబ్రవరి 17: ఇంటర్, పదో తరగతి, ఇతర ముఖ్యమైన పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు ఈనెల 22న సరస్వతి పూజను నిర్వహించనున్నట్లు రత్నగిరి ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. విద్యార్థులచే సరస్వతి పూజను చేయించి కలములు, కంకణాలను అందించనున్నామన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవో కోరారు.

స్థలాలు లేని పట్టాలెందుకు?

- తక్షణమే స్థలాలు చూపాలని మహిళల ధర్నా
- కడియం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు
- రెండు గంటల పాటు ఆందోళన
- రోడ్డుపై భారీగా నిలిచిన ట్రాఫిక్
- సమస్య పరిష్కరిస్తామని జేసీ తేజ్‌భరత్ హామీ



రోడ్డుపై బైఠాయించిన మహిళలు

కడియం, ఫిబ్రవరి 17: 'వైసీపీ ప్రభుత్వం జగనన్న పట్టాలు ఇచ్చి నాలుగేళ్లు దాటింది.. పట్టాలిచ్చారు కానీ నేటికీ స్థలాలు చూపలేదు. అద్దె ఇళ్లలో ఉంటున్నాం.. అదిగో స్థలం.. ఇదిగో పట్టా అంటూ మోసగిస్తున్నారు కానీ ఇళ్ల స్థలాలు చూపలేదు' అని కడియం మండలం వేమగిరి తోట, గట్టు, వేమగిరి గ్రామాలకు చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రెండు గంటల పాటు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిత్యం రద్దీగా ఉండే వేమగిరి-కాకినాడ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. సమస్య పరిష్కరిస్తేనే కానీ కదిలేది లేదని స్పష్టం చేశారు. మండలంలో వేరే వేరే ఊర్లు వారికి స్థలాలు ఇచ్చారు. ఊరిలో ఉండే తమకు ఇవ్వలేదని వాపోయారు. శనివారం ఉదయం స్థలాలు ఇస్తున్నామంటూ పిలిచి రాళ్ల వద్ద ఉండమని పట్టాపై నెంబర్ ఇచ్చారని దాని కోసం రూ. 150 చొప్పున తీసుకున్నారని చెప్పారు. అలానే రాళ్లకు రూ. 400 చొప్పున తీసుకున్నారన్నారు. ఇళ్ల స్థలాలు ఇస్తారేమో అని గత కొద్దిరోజులుగా ప్రతి రోజు పనులు మాని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఏమి ప్రయోజనం లేదన్నారు. సుమారు 800 కుటుంబాలను పట్టాలు ఆశ చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కార్యాలయాల చుట్టు తిప్పుకుంటున్నారన్నారు. జగనన్న లేఅవుట్‌లో సుమారు 20 ఎకరాల జడ్పీ భూమిని లేఅవుట్‌గా కేటాయించి నాలుగేళ్ల కిందట సుమారు 800 మంది లబ్ధిదారులను గుర్తించి పట్టాలు ఇచ్చారన్నారు. సాంకేతిక కారణాలు చూపి పట్టాలున్న వారికి స్థలాలు ఇవ్వకుండా జాప్యం జరుగుతుందన్నారు. ఆందోళన ఉధృతంగా మారుతుందనే సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ బి.రమాదేవి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు తమకు న్యాయం చేయాలని లేకుంటే ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. భారీగా ట్రాఫిక్ స్తంభించింది. దీంతో తహశీల్దార్ రమాదేవి కొంతమంది ప్రతినిధులను కార్యాలయంలోకి రమ్మని వారితో మాట్లాడారు. అనంతరం ఐదుగురు తహశీల్దార్‌తో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లగా అక్కడ జేసీ తేజ్‌భరత్ వారితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపి న్యాయం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి నాని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించారు. ఆందోళన కార్యక్రమంలో నల్లా వరలక్ష్మి, డి.సాయిలక్ష్మి, ఎస్.పద్మావతి, స్వర్ణలత, జోగి మల్లేశ్వరి, భోగిరెడ్డి జ్యోతి, ఇసుకపూడి వెంకటలక్ష్మి, ఇసుకపూడి సత్యవతి, నాగదేవి, ఈడేపల్లి దివ్య, పడాల శ్రీదేవి, పితాని సూర్యకుమారి, ఆకుల సత్యవేణి, ఈత మంగాదేవి, పార్వతి, నూకల లక్ష్మి, కోనే పద్మావతి, అల్లం వెంకటేశ్వరావు, షేక్ రెహమాన్, జ్యోతి, నాగిరెడ్డి, దేవి, జి.దివ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రమాదేవితో చర్చలు

రత్నగిరిపై పెళ్లిసందడి

అన్నవరం, ఫిబ్రవరి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి శనివారం పెళ్లి బాజాలతో హోరెత్తింది. మాఘమాసంలో శనివారం బలమైన ముహూర్తాలు రాత్రి 11.30, వేకువజామున 3.30 నిమిషాలు కావడంతో స్వామివారి సాక్షిగా వివిధ ప్రాంతాలలో జరిగిన వివాహాలతో సుమారు 200 జంటలు ఒక్కటయ్యాయి. సత్రం గదులు సరిపడకపోవడంతో పెండ్లిబృందాలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివాహ బృందాల కోసం ఉచిత కల్యాణ మండపాలు, విష్ణుసదన్ హాల్స్, సీతారామ సత్రం, పాత, కొత్తసెంటినరీ కాటేజీలు, ఆలయ ప్రాంగణంలో వివాహాలు జరిగాయి. వివాహాలు చేయించే పురోహితులు, భాజాభజంత్రీలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఆలయ ప్రాంగణమంతా వివాహ బృందాలతో రద్దీగా మారింది. ఆదివారం ఉదయం స్వామివారి సన్నిధికి విశేషంగా భక్తులు, నవదంపతులు విచ్చేయనుండడంతో అధికారులు వారికి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

అద్దెకు ఉంటూ దొంగతనాలు

కడియం, ఫిబ్రవరి 17: అద్దెకు ఉంటూ దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కడియం పోలీసులు పట్టుకున్నారు. సీఐ బి.తులసీధర్ వివరాల ప్రకారం... రాజమహేంద్రవరం నల్లమందు సందులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. అతడిని విచారించగా పెరవలి మండలం ఖండవిల్లికి చెందిన పల్లెపు విజయకుమార్‌గా గుర్తించామన్నారు. అతడు 2, 3 నెలల కొకసారి ఊర్లు మారుతూ ఇంటి ఓనర్లతో, చుట్టుపక్కల వారితో స్నేహం చేసి వారిని మభ్యపెట్టి వారింట్లో దొంగతనాలకు పాల్పడుతుంటాడన్నారు. అలాగే వేమగిరిలో దొడ్డా ఉమాపార్వతి బంధువుల ఇంటికి 3నెలల క్రితం అద్దెకు వచ్చి వారింట్లో సుమారు రూ.2 లక్షల బంగారం దొంగిలించుకుపోయాడన్నారు. అతనిపై తెనాలి, విశాఖపట్నంలో కూడా కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచినట్టు చెప్పారు.

కోట సత్తెమ్మ ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా హరి

నిడదవోలు, ఫిబ్రవరి 17: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం(శివ)ను సామర్లకోటలోని కుమార భీమేశ్వరస్వామి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా బదిలీ చేశారు. కోట సత్తెమ్మ ఆలయాన్ని అసిస్టెంట్ పరిధిలోకి తీసుకురావడంతో అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న హరి సూర్యప్రకాష్‌ను కోట సత్తెమ్మ ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలో బాధ్యతలు స్వీక రించనున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.1.58 లక్షలు

మామిడికుదురు, ఫిబ్రవరి 17: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని వారికి శనివారం ఒక్కరోజు వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,58,509 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. స్వామివారిని 2,863మంది దర్శించుకుని 2,095మంది అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం

బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి వెదురుపాకకు చెందిన వాకపల్లి సూర్యనారాయణమూర్తి, వాన వెంకటసూర్యచంద్రరావు కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

బావిలో మహిళ మృతదేహం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 17: ఈనెల14న అదృశ్యమైన ద్రాక్షారామ బియ్యంపేటకు చెందిన వివాహిత మృతిచెందింది. ఆమె మృతదేహం శనివారం ఓ బావిలో కనిపించింది. బియ్యంపేటకు చెందిన దొంగల వరలక్ష్మి (30) ఈనెల 14 తెల్లవారుజాము నుంచి కనిపించడం లేదు. భర్త నరసింహమూర్తి, కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలింపు చేపట్టారు. ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శుక్రవారం రాత్రి వరలక్ష్మి అదృశ్యంపై కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం బెస్తపేట సమీపంలో బావిలో వరలక్ష్మి మృతదేహం కనిపించింది. ఎస్‌ఐ సురేంద్రబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్‌ఐ సురేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

రామచంద్రపురం, ఫిబ్రవరి 17: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో నకిలీ నోట్ల ముఠాను శనివారం పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ రామకృష్ణ వెల్లడించారు. చెడు వ్యసనాలకు, ఈజీ మనీకి అలవాటు పడ్డ మాగంటి గోపి, బోయ గోవిందరావు, వాసంశెట్టి వీరభద్ర రఘురాం, బడుగంటి వీరవెంకటరమణలు ముఠాగా ఏర్పడ్డారు. వారికి విజయనగరం జిల్లా గూడుపువలసకు చెందిన చల్లా నూకరెడ్డి, విజయనగరం జిల్లా శాంతినగర్‌కు చెందిన మీసాల అప్పలరాజులు నకిలీ నోట్ల తయారీకి కావలసిన సామగ్రిని అందిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలానికి చెందిన బోయి గోవిందరావు ఈ సామగ్రిని రామచంద్రపురానికి చేరవేస్తున్నాడు. రామచంద్రపురం పట్టణం రత్నంపేటకు చెందిన మాగంటి గోపి, రామచంద్రపురం మండలం నరసాపురపుపేటకు చెందిన బడుగంటి వీరవెంకటరమణ, రాయవరం మండలం వెంటూరుకు చెందిన వాసంశెట్టి వీరభద్రరఘురామ్‌లు రామచంద్రపురంలో రత్నంపేటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ నోట్లు ముద్రిస్తున్నారు. రద్దీగా ఉండే రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో నకిలీ నోట్లు చలామణి చేస్తున్నారు. ఏడాది కాలంగా నకిలీ నోట్లు ముద్రణ, చలామణి చేస్తున్నారు. నకిలీ ముద్రణలో బోయి గోవిందరావు కూడా సహకరిస్తున్నాడు. పోలీసులకు అందిన సమాచారంతో శనివారం ఎస్పీ శ్రీధర్‌బాబు ఆదేశాలతో డీఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది ఆ ఇంటిపై దాడి చేసి నకిలీ నోట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మాగంటి గోపి, బడుగంటి వీరవెంకటరమణ, వాసంశెట్టి వీరభద్రరఘురామ్, బోయి గోవిందరావులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.75,000 నకిలీ నోట్లు, రెండు ప్రింటర్లు, నకిలీ నోట్ల ముద్రణకు వాడే ఎ4 కాగితాల కట్ట, వాటర్‌మార్కు, దారం, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ వెల్లడించారు. విజయనగరం జిల్లాకు చెందిన చల్లా నూకరెడ్డి, మీసాల అప్పలరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వారిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ దొరరాజును, ఎస్‌ఐ సురేష్‌బాబుని, పోలీసు సిబ్బందిని ఎస్పీ శ్రీధర్, డీఎస్పీ బి.రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయ స్థాయికి ఎంపికైన తొండవరం విద్యార్థుల ప్రాజెక్టు



జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు ఇదే..

అంబాజీపేట, ఫిబ్రవరి 17: జైపూర్‌లో మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యుకేషన్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మెర్స సంస్థ నిర్వహించిన ఎస్ఐసీ ఇన్నోవేషన్ కాంటెస్టులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయ స్థాయికి ఏపీ తరుపున ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఒకే ఒక ప్రాజెక్టు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం పీవీ కేశవాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడానికి కొబ్బరి పీచుతో తయారు చేసిన కోకోనట్ క్వాయర్ కార్బన్ డై ఆక్సైడ్ ఫిల్టర్ ప్రాజెక్టును పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు గణేష్ నరసింహారావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఎస్.శ్రీరామ్, ఎం.నమిత, ఎం.పార్వతి రూపొందించి శనివారం ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టులు 24 ఎంపిక చేయగా వాటిలో తొండవరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టును ఎంపిక చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి, జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు.

గుర్తుతెలియని బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

రాయవరం, ఫిబ్రవరి 17: సోమేశ్వరం-కుతుకులూరు రోడ్డులో ఇటుక బట్టీ సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో వృద్ధుడు మృతి చెందాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరానికి చెందిన పులగం ధర్మారెడ్డి(70) కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా వృద్ధుడిని మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న దంపతులు ఢీకొట్టడంతో అతడు మృతిచెందాడని, రోడ్డు పక్కనే వృద్ధుడిని పడుకోబెట్టి దంపతులు వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. స్థానిక ఇటుక బట్టీ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. రాయవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శృంగారవల్లభస్వామి ఆలయంలో రద్దీ

పెద్దాపురం, ఫిబ్రవరి 17: మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3,50,200, అన్నదాన విరాళాలు రూ.76,424, కేశఖండన ద్వారా రూ.5,560, తులాభారం రూ.400 వెరసి రూ.4,32,584 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 15 వేల మంది స్వామిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారన్నారు.

టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయం

» ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ » వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు


ప్రత్తిపాడు:టీడీపీలోకి చేరినవారితో సత్యప్రభ


తుని రూరల్:టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కృష్ణుడు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ, జనసేన కూటమి విజయం ఖాయమని.. ఈ రెండు పార్టీలు కలసి ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యమని ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. ఏలేశ్వరం 5వ వార్డులో శనివారం వైసీపీకి చెందిన 150 కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరాయి. పెంద్ర శ్రీను, బూర్లు మణికంఠ, మోరంపూడి నాని ఆధ్వర్యంలో 5వ వార్డుకు చెందిన మాజీ వార్డు సభ్యులు కోన లక్ష్మి, మాదే ఎరకయ్యనాయుడు, బూర్లు బాబురావు, కాంతం తదితరులకు సత్యప్రభ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం ఏర్పడబోతుందని, ప్రజల కష్టాలు నూతన ప్రభుత్వంలో పరిష్కారాలు కానున్నాయని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతిగ్రామం నుంచి పెద్ద ఎత్తున వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరుతున్నారని.. ప్రజల్లో టీడీపీ, జనసేనల ప్రభంజనానికి ఇదే నిదర్శనమన్నారు. పార్టీలోకి చేరిన వారందరికి సముచిత స్థానం కల్పించి ఎవరి గౌరవానికి ఇబ్బంది కలగకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపాలకృష్ణ, మూది నారాయణ స్వామి, వెంకటరమణ, నాగబాబు, జ్యోతుల పెదబాబు, బస్వా ప్రసాద్, చిగటాపు సూరిబాబు, వైబోగుల సుబ్బారావు, పలివెల శ్రీను, పతివాడ రామకృష్ణ, బూర్లు సత్తిబాబు, కోరాల కృష్ణమోహన్, బెల్లాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తునిలో...

తుని రూరల్, ఫిబ్రవరి 17: తుని టీడీపీ కార్యాలయంలో కోటనందూరు మండలం తాటిపాక గ్రామానికి చెందిన సుర్ల అప్పలనాయుడు, మిడతా నారమ్మ నాయుడు, లింగబాబు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 3, 6 వార్డుల పంచాయతీ మెంబర్లు సుర్ల కొండబాబు, సుర్ల కన్నబాబుతో పాటుగా బొడ్డు నాని, చిటికెల లచ్చన్న, సుర్ల నాగేశ్వరరావు, లగుడు బాపినాయుడు, పలు కుటుంబాలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేఈ చిన్నాయిపాలెంలో...

కోటనందూరు, ఫిబ్రవరి 17: కేఈ చిన్నాయిపాలెం గ్రామానికి చెందిన 20 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. అంకంరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో రావాడ సన్యాసిదేముడు, అల్లు రాము, పోలుపర్తి రమణ, బొడ్డు సురేష్ పలువురు టీడీపీలో రాగా వారికి టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, మోతుకూరి వెంకటేష్, డి.చిరంజీవి రాజు, షేక్‌నవాబ్‌జానీ, పెనుమతి గణేష్ పాల్గొన్నారు.


జగ్గంపేటలో ధర్నా చేస్తున్న ఏపీ జేఏసీ ఉద్యోగులు

'బకాయిలు వెంటనే చెల్లించాలి'

జగ్గంపేట, ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావలసిన డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని ఐక్య కార్యాచరణ సమితి జగ్గంపేట యూనియన్ చైర్మన్ వీవీవీ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం జగ్గంపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కృష్ణ మాట్లాడుతూ 2022 పీఆర్సీ ప్రకారం ఉద్యోగస్తులకు రూ.7500 కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను వెంటనే స్పందించాలని లేనిపక్షంలో భాగస్వామ్య జిల్లా కేంద్రాల్లో ఈనెల 20న ధర్నా, 27న ఛలో విజయవాడలో మహా ధర్నా చేపడతామన్నారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్ మీదుగా కాకినాడ రోడ్డులోని పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో జగ్గంపేట కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వరరావు, ట్రెజరర్ పి.ప్రభాకర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.సునీల్ వర్మ, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ ప్రసన్నకుమార్, ఎ.చల్లారావు, జాయింట్ సెక్రటరీ కె.రాజరత్నం, పెన్షనర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రమౌళి వెంకటశాస్త్రి, వైస్ ప్రెసిడెంట్ తోలేటి సూర్యనారాయణ, ఎం.సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

'ఆస్తిపన్నుపై యుద్ధానికి మేము సిద్ధం'


మేము సిద్ధం కార్యక్రమంలో జనసేన నాయకులు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 17: ఆకాశాన్నంటుతున్న ఆస్తిపన్నుపై యుద్ధానికి మేము సిద్ధమని జనసేన పార్టీ కాకినాడ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ అన్నారు. బాలాజీచెరువు సెంటర్ దేవాలయం వీధి వద్ద పార్టీ సిటీ సహాయ కార్యదర్శి మిరియాల హైమావతి, 36వ డివిజన్ అధ్యక్షుడు సుంకర సురేష్ ఆధ్వర్యంలో మేము సిద్ధం కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి అట్ల సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, చీకట్ల శ్రీనివాస్, సాధనాల రమేష్, మిరియాల చినబాబు పాల్గొన్నారు.

'సెక్టార్ అధికారుల బాధ్యతలు కీలకం'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల బాధ్యతలు కీలకమని నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి, సబ్ కలెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ సెక్టార్ అధికారుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈవీఎం మిషన్లు, పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్‌బ్యాక్సుల చేరవేత తదితర బాధ్యతలు సెక్టార్ అధికారులపై ఉందన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో సెక్టార్‌కు చెందిన పోలీస్ అధికారులు తోడ్పాటునందించాలన్నారు. తహశీల్దార్ ఎస్.నరసింహారావు, డిప్యూటీ తహశీల్దార్లు తాతపూడి శ్రీనివాసరావు, పీ.సత్యనారాయణ, ఆర్‌వోడీటీ శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

21 నుంచి బీజేపీ ప్రజాపోరు రథయాత్ర

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: ఈనెల 21 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రజాపోరు రథయాత్ర నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా నేత కొల్లా శ్రీనివాస్, ప్రజాపోరు కార్యక్రమ కన్వీనర్ గట్టెం వెంకటరమణ తెలిపారు. స్థానిక రాజా కింగ్‌బాబు రాజు స్వగృహంలో శనివారం జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ నాయకులు గంటా బాలుదొర, దాకే కృష్ణారావు, కించు జోగిరాజు మాట్లాడుతూ, జిల్లా మహిళ మోర్చా ఉపాధ్యక్షురాలు రెడ్డి వరలక్ష్మి, జిల్లా సైనిక సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, మండలాధ్యక్షుడు కందా వీరాస్వామి, రెడ్డి లోవరాజు, మదినే బాబ్జి, దత్తాత్రేయ, ఏనుగు ధర్మరాజు, పతివాడ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

'ఓటుహక్కు వజ్రాయుధం వంటిది'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: ఓటు హక్కు ప్రతి ఒక్కరికీ వజ్రాయుధం వంటిదని ఏలేశ్వరం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత తెలిపారు. కళాశాల విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటుహక్కును ఓటర్ల అందరూ సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కన్వీనర్ డి.ప్రయోగమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'స్థానికులకే ఇళ్ల పట్టాలివ్వాలి'

తాళ్లరేవు, ఫిబ్రవరి 17: చొల్లంగిలో స్థానికులకే ఇళ్ల స్థల పట్టాలు ఇవ్వాలని 18రోజులుగా నిరసన తెలియజేస్తున్నా వైసీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు పట్టడం లేదని బాధితురాలు అల్లం వీరలక్ష్మి అన్నారు. శనివారం దీక్ష శిబిరం వద్ద పలువురు నిరసన తెలిపారు. పులపకూర వెంకటరావు మాట్లాడుతూ వైసీపీ నేతలు శిబిరం ముందు నుంచే వెళిపోతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

మంత్రి కారుమూరిని కలిసిన నందిపాటి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 17: మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నందిపాటి పల్లయ్య మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శనివారం వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు నివాసానికి మంత్రి రాగా రేషన్ డీలర్ల ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం సీఎం జగన్ దృష్టికి తీసుకెళతానని మంత్రి హామీ ఇచ్చారు. జడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, జంగా గగారిన్ పాల్గొన్నారు. వైద్యనగర్‌లో ఎమ్మెల్యే కన్నబాబును వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్ కలిశారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకారసేవ


తిరుచ్చివాహనంపై స్వామి,అమ్మవార్లు

అన్నవరం, ఫిబ్రవరి 17: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను మేళతాళాలతో సర్వాంగసుందరంగా సుగంధభరిత పుష్పాలతో తీర్చిదిద్దిన తిరుచ్చిపై ఆశీనులు గావించి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

దుర్గాడలో అమెరికా దేశస్థులు



గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 17: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామాన్ని అమెరికా (యూఎస్ఏ)కు చెందిన ఎం.మార్టిన్ సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి గ్రామంలోని బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కార్యసిద్ధి హనుమాన్ స్వామిని దర్శించుకున్నారు. వీటి విశిష్టతలను ఆలయ కమిటీ ప్రతినిధులు వివరించి శేషవస్త్రాలతో సత్కరించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఈగల్, ఊరు పేరు భైరవకోన, మేడమ్‌వెబ్, గుంటూరుకారం, ట్రూలవర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఈగల్, యాత్ర 2, ఊరు పేరు భైరవకోన, గుంటూరుకారం

తిరుమల	:	సూర్యసన్‌ఆఫ్‌కృష్ణన్, ఓయ్
లక్ష్మి	:	ఈగల్
సీ అండ్‌సీ1	:	ఈగల్
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
పద్మప్రియ	:	ఊరు పేరు భైరవకోన
సత్యగౌరి	:	ఊరు పేరు భైరవకోన
సూర్య 1	:	ఈగల్
సూర్య 2	:	ఊరు పేరు భైరవకోన

రేపు జాబ్ మేళా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 17: కాకినాడ కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు తెలిపారు. ఈ మేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. వివరాలకు 7799376333లో సంప్రదించాలన్నారు.

మత్స్యకారులకు న్యాయం చేస్తాం

టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల


నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేస్తున్న యనమల

తొండంగి, ఫిబ్రవరి 18: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులకు తగిన న్యాయం చేస్తామని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు తెలిపారు. మండలంలో ఏర్పాటైన కాలుష్యకారక పరిశ్రమల కారణంగా మత్స్యకారుల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని ఒంటిమామిడిలో గత 2రోజులుగా దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం యనమల కృష్ణుడు శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లను ఫ్యాక్టరీల యాజమాన్యం, ప్రభుత్వం తక్షణం నెరవేర్చాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారుల సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని అంతవరకూ వేచి ఉండాలన్నారు. దీక్షలో ఉన్నవారికి ఆయన నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. టీడీపీ మత్స్యకార జిల్లా అధ్యక్షుడు కోడ వెంకటనమణ, పార్టీ మండలాధ్యక్షులు చొక్కా అప్పారావు, చొక్కా కాశీశ్వరావు, చొక్కా బుల్లబ్బాయి, అప్పలరాజు, మహంకాళి, తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పేకేటి హరికృష్ణ పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారి దురుసు ప్రవర్తన


బ్యాంక్ అధికారిని నిలదీస్తున్న మహిళలు

శంఖవరం, ఫిబ్రవరి 17: డ్వాక్రా రుణాల కోసం బ్యాంకుకు వెళ్లిన మహిళల పట్ల బ్యాంకు మేనేజరు దురుసుగా ప్రవర్తించడంతో వారు నిరసన తెలిపారు. నెలల తరబడి రుణాల కోసం సంఘాల సభ్యులను బ్యాంకు చుట్టూ తిప్పించుకుంటు మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, అవమానకరంగా మాట్లాడుతున్నారని మేనేజర్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీపీ పర్వత రాజబాబుతో ఫోన్ చేయించారనే కారణంతో మహిళల పట్ల దురుసుగా మాట్లాడారని వారు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రాజబాబు బ్యాంకు అధికారులతో మాట్లాడారు. ఖాతాదారులతో ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని బ్యాంకు ఎదురుగా ధర్నా నిర్వహించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు.

రూ.కోటితో చేపట్టే పనులకు కౌన్సిల్ ఆమోదం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో స్టేట్ ఫైనాన్స్ నిధులు రూ.కోటితో చేపట్ట పనులకు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం తీర్మానించి ఆమోదించింది. చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ సత్యవతి మాట్లాడుతూ నగర పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు, పాలక వర్గసభ్యులు సహకరించాలని కోరారు. రాబోయే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏలేశ్వరంలో ఏర్పాట్లు ఘనంగా నిర్వహించడానికి కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. వైస్ చైర్మన్ మసరపు బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, కోరాడ రామలక్ష్మి,దోశే కిషోర్‌బాబు, హైమావతి, శేషారత్నం, నగర పంచాయతీ కమిషనర్ కె.శివప్రసాద్ ఉన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి


మృతిచెందిన వ్యక్తి

తుని రూరల్, ఫిబ్రవరి 17: గుర్తు తెలియని రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుని రైల్వే పోలీసులు, మాస్టర్ సమాచారం ప్రకారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చే రుకుని మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నట్టు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుని రైల్వే పోలీస్‌స్టేషన్లో లేదా 94948 87786 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

ఇంటిలిజెన్స్ పోలీసుకు గాయాలు

సామర్లకోట, ఫిబ్రవరి 17: సామర్లకోట-పిఠాపురం రోడ్డులో గణపతిశాస్త్రి ఇంటి ఎదురుగా సామర్లకోట బ్రౌన్‌పేటకు చెందిన ఇంటిలిజెన్స్ పోలీసు ప్రమాదవశాత్తూ మోటార్‌సైకిల్ పై నుంచి రోడ్డుపైకి పడిపోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. కోమాలోకి చేరిన పోలీసు రాజ్‌కుమార్‌ను స్థానికంగా ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమికంగా చికిత్స నిర్వహించారు. ఉన్నత చికిత్సకు కాకినాడ తరలించారు. సామర్లకోట పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్ల కోసమే ఇళ్ల పట్టాలు మంజూరు

టీటీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ


కొమరగిరిలో ప్రజలతో మాట్లాడుతున్న వర్మ

కొమరగిరి (కొత్తపల్లి), ఫిబ్రవరి 17: మరో రెండు నెలల్లో ఎన్నికలు రానున్న దృష్ట్యా ఓట్ల కోసం వైసీపీ ప్రజాప్రతినిధులు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నారని టీటీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. కొమరగిరిలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఇచ్చిన పట్టాలకు బౌండరీలు ఎక్కడో, స్థలం ఏదో తెలియకుండా ఓట్లను రాబట్టుకోవడానికి హడావిడిగా పట్టాలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. కొమరగిరిలో ఇళ్ల పట్టాల సమస్య ఉందన్నారు. ఇక్కడ భూమిని సేకరించి కాకినాడ పరిసర ప్రాంతాల వారికి పట్టాలు ఇవ్వడం చాలా బాధాకరమన్నారు. ఎంపీ రూ.20కోట్ల కాంట్రాక్టు దక్కించుకోవడం కోసం ఎకరానికి రూ.10లక్షల కమిషన్‌కు కక్కుర్తిపడి కాకినాడ ఎమ్మెల్యేకు 100 ఎకరాలు ఇచ్చారని వర్మ ఆరోపించారు. అదేభూమిని ఎస్సీ జెడ్ నుంచి డీనోటిఫై చేయాలని అప్పట్లో చంద్రబాబు విజ్ఞప్తి చేశారన్నారు. మత్స్యకార గ్రామాలు, కొమరగిరి, కొత్తపల్లి, వాకతిప్ప గ్రామాలకు ఇళ్ల స్థలాల కోసం 100ఎకరాలు అవసరమని చంద్రబాబు ప్రపోజల్ పెట్టారన్నారు. దురదృష్టవశాత్తు తెలుగుదేశం ఓడిపోవడంతో అదే భూమిని ప్రజాప్రతినిధులు కాకినాడకు ధారాదత్తం చేశారని ఆరోపించారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని అధికారంలోకి రాగానే కొమరగిరి లేఅవుట్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో గుర్తించి స్థానికులకే పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అనిశెట్టి సత్యానందరెడ్డి, కఠారి రాజబాబు, బత్తుల చైతన్యరాజేష్ కుమార్, రాయుడు శ్రీరాములు, వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, కన్నబ్బాయి, త్రిమూర్తులు నాయకులు పాల్గొన్నారు.

కాపులను మోసం చేసేందుకు వైసీపీ ప్రయత్నం


సమావేశంలో మాట్లాడుతున్న కాపు నాయకులు

పిఠాపురం టీడీపీ కాపు నాయకులు

పిఠాపురం, ఫిబ్రవరి 17: ఐదేళ్ల పాటు అధికారంలో ఉండగా కాపులను పట్టించుకోని వైసీపీ నేతలు ఇప్పుడు వారిపై అపార ప్రేమ కనబరుస్తూ మరోమారు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కాపు నాయకులు విమర్శించారు. పిఠాపురంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ఎస్వీఎస్ఎన్ వర్మ కాపు కల్యాణమండపం నిర్మాణం నిమిత్తం రూ.4కోట్ల విలువైన 64సెంట్లు భూమిని కేటాయించి రూ.50లక్షల నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. టెండర్ ఖరారైందని, ఈలోగా ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఐదేళ్లుగా కాపు కల్యాణ మండపాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోగా, ఆ స్థలాన్ని తమ వారికి ఇళ్లపట్టాలు ఇచ్చే ప్రయత్నం చేస్తే తాము అడ్డుకోవడం జరిగిందని వివరించారు. శంకుస్థాపన శిలాఫలకాన్ని తొలగించారని తెలిపారు. ఐదేళ్లు ఎంపీగా ఉండి పట్టించుకోకుండా ఇప్పుడు పిఠాపురం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఇచ్చారు కాబట్టి మరోమారు మోసం చేసే ప్రయత్నాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. కాపుల కోసం వైసీపీ ప్రజాప్రతినిధులు చేసింది శూన్యమని విమర్శించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు రెడ్డెం భాస్కరరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండేపూడి సూర్యప్రకాష్, దేవరపల్లి రామారావు, సోము సత్యనారాయణ, కోడిగుడ్ల పెదబాబు, అల్లవరపు నగేష్, నల్లా శ్రీను, అద్దూరి శ్రీను, పెదిరెడ్ల నంది, మసకపల్లి రాజా, ఆలం దొరబాబు, కరణం సాయిబాబా, బస్వా సత్యనారాయణ, నల్లా గోవిందు తదితరులున్నారు.

యూపీహెచ్‌సీలను సందర్శించిన కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 17: కాకినాడ గాంధీనగర్, రామారావుపేటలోని వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శనివారం సందర్శించారు. ఆయా యూపీహెచ్‌సీల్లో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అందుబాటులో ఉన్న వసతులు, కల్పించాల్సిన సౌకర్యాలను అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు చేరువగా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈ సుబ్బారావు తదితరులున్నారు.

బాలబాలికల హక్కులపై అవగాహన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: ప్రత్తిపాడులోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద బాల్యవివాహాల నిర్మూలన చట్టం,బాలబాలికల హక్కులపై అవగాహన సమాఖ్య అధ్యక్షురాలు చిట్టుమూరి లోవకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098కు ఫోన్ చేయాలని శిశు సంక్షేమ శాఖఅధికారి దుర్గారాణి తెలిపారు. చైల్డ్‌ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, ఏపీఎం వెంకట్, మండల మహిళా సమాఖ్యకార్యదర్శి స్వప్న ఉన్నారు.

జ్యోతుల నవీన్ ప్రచారం

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 17: మండలంలోని జె.కొత్తూరు గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో చల్లా రామూర్తి, చింతల కన్నారావు, సైనం శ్రీను, కేజీ రెడ్డి శ్రీను, అడప తాతాజీ, అడపామైనేరు, దంట పెద్దకాపు, నకిరెడ్డి సూర్యవతి ఉన్నారు.

దళితుల ఆందోళన

కిర్లంపూడి, ఫిబ్రవరి 17: రామచంద్రపురంలో దళిత స్మశాన వాటికలో అక్రమ పత్రాలు సృష్టించి కాకాడ సత్యనారాయణ అక్రమంగా భవన నిర్మాణం చేపడుతున్నారని, అధికారులు ఆ నిర్మాణం తొలగించాలని దళితులు శనివారం ఆందోళన చేశారు.

16వరోజుకు శానిటేషన్ వర్కర్ల ఆందోళన

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 17: పీఎఫ్ వాటా సొమ్ము శానిటేషన్ వర్కర్ల జీతాల్లో నుంచి కటింగ్ చేయడానికి వ్యతిరేకంగా, వేతనాల పెంపు కోసం శానిటేషన్ వర్కర్లు కాకినాడ జీజీహెచ్ వద్ద నిర్వహిస్తున్న ఆందోళన శనివారానికి 16 రోజులకు చేరింది. ఈ సందర్భంగా జీజీహెచ్ కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్ల యూనియన్ నాయకులు కృష్ణవేణి, జనార్ధన్ మాట్లాడుతూ 16రోజులుగా న్యాయసమ్మతమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన నిర్వహిస్తున్నా కాంట్రాక్ట్ నిర్వాహకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు జోక్యం చేసుకుని పరిష్కరించాలని, లేకపోతే మార్చి 1 నుంచి కేవలం ఎమర్జెన్సీ విభాగాలు మినహాయించి సమ్మెకు దిగుతామని అల్టిమేటం జారీ చేశారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, సీ.విజయ్‌కుమార్, జె.శేషు, రమేష్, వాసు, రవి, చంద్రకళ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా శ్రీనివాసరావు

సామర్లకోట, ఫిబ్రవరి 17: సామర్లకోట తహశీల్దార్‌గా ఏలూరు జిల్లా ఇరగవరం మండలంలో పనిచేస్తున్న వై.శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా ఇక్కడ పనిచేసిన ఎస్.కుమారి ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

శివానంద సరస్వతికి ఆహ్వానం

జగ్గంపేట, ఫిబ్రవరి 17: ఇర్రిపాకలో ఈనెల 26 నుంచి మార్చి 7 వరకు నిర్వహించే కోటి పార్థివ లింగాల రుద్రాభిషేకానికి హాజరుకావాలని గుంటూరు జిల్లా తాడేపల్లిలో మాత శివానంద సరస్వతిని మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆహ్వానించారు.

బంగారు పాప ఉరుస్ ఉత్సవాలు


బంగారుపాపను దర్శనం చేసుకున్న భక్తులు

పొన్నాడ (కొత్తపల్లి), ఫిబ్రవరి 17: పొన్నాడ బంగారు పాప ఉరుస్ ఉత్సవాల్లో రెండోరోజు శనివారం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన హిందూ,ముస్లిం భక్తులు బంగారుపాపను దర్శనం చేసుకున్నారు. భక్తులకు ముజావర్లు గాజులు, ప్రసాదాన్ని అందజేశారు. ఆదివారం ఉరుసు ఉత్సవాలు ముగింపులో భాగంగా ఇతర జిల్లాల నుంచి సుమారు 90వేల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు చర్యలు చేపడుతున్నామని కొత్తపల్లి ఎస్ఐ పీవీ.స్వామినాయుడు తెలిపారు.

పిఠాపురం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

పిఠాపురం, ఫిబ్రవరి 17: రాష్ట్రస్థాయి ఎడ్యుకేషనల్ ఎపిఫని పరీక్షల్లో పిఠాపురం పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన పాఠశాల ఏడవ తరగతి విద్యార్థులు జి.విజయప్రభ, మనోజ్ఞలకు శనివారం విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నగదు పురస్కారాలు అందజేశారు. విద్యార్థులు, వారికి మార్గదర్శకత్వం చేసిన సైన్స్ టీచర్ సుధారాణి, జానకిలను ప్రిన్సిపాల్ శ్యాంబాబు అభినందించారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ



పిఠాపురం, ఫిబ్రవరి 17: జిల్లా గ్రంథాలయ సంస్థ నిర్వహణలోని పిఠాపురం శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రూప్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో గ్రూప్ 1,2 పరీక్షలకు హాజరవుతున్న 30మంది విద్యార్థులకు కాకినాడ సత్యం స్టడీ సర్కిల్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి రేపాక వెంకటరాము ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడభూషి సంజశ్రీ, సూర్యరాయ విద్యానంద గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులున్నారు.

కాండ్రకోటలో ఎమ్మెల్యే పూజలు

పెద్దాపురం, ఫిబ్రవరి 17: మండలంలోని కాండ్రకోట గ్రామంలో భువనేశ్వరీ సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో మహారుద్రాభిషేకంలో ఎమ్మెల్యే తనయుడు నిమ్మకాయల రంగనాగ్, ఎలిశెట్టి నాని, మేడిది శ్రీనివాస్, చాగంటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీర పేరంటాలమ్మ జాతర ప్రారంభం

గండేపల్లి, ఫిబ్రవరి 17: మండలంలో నీలాద్రిపేట గ్రామ శివారు వెలిసిన వీర పేరంటాలమ్మ జాతర మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నక్కా సత్తిబాబు మాట్లాడుతూ 5రోజులపాటు జాతరలో కోలాట నృత్యాలు, బాణసంచా, భక్తి ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. మల్లేపల్లి గ్రామ శివారులో వెలిసిన గున్నాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

'శ్రీ ప్రకాష్'లో అవగాహన సదస్సు

తుని రూరల్, ఫిబ్రవరి 17: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో కేంద్రీయ ఔషధ సుగంధ మొక్కల సంస్థ పరిశోధనా కేంద్రం ప్రతినిధులతో రైతులు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీడీ కిరణ్ బాబు, సీనియర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జె.కోటేశ్‌కుమార్, కేవీఎస్ శ్రీనివాస్, ప్రాజెక్టు టెక్నికల్ కృష్ణ వంశీ మొక్కల పెంపకం ప్రొసెసింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

సతీష్‌బాబును కలిసిన టీడీపీ నేతలు

రౌతులపూడి, ఫిబ్రవరి 17: సానా ఫౌండేషన్ చైర్మన్ సానా సతీష్‌బాబును రౌతులపూడి మండల టీడీపీ నేతలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన-టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కలిసినవారిలో ఎంపీటీసీ సోమరౌతు రవి, అల్లు నూకరాజు, గురునాద్, కోరుప్రోలు ధనాజీ, ఉపసర్పంచ్ చిపురపల్లి తాతాజీ తదితరులు ఉన్నారు.

ముద్రగడ పరామర్శ

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 17: ధర్మవరం గ్రామంలోని పెదిరెడ్ల గంగారావు సతీమణి సురేఖ రాజమండ్రిలో జరిగిన ప్రమాదంలో ఆకస్మికగా మృతి చెందడంతో మృతురాలు కుటుంబ సభ్యులను శనివారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. చెక్కపల్లి సత్తిబాబు, బొల్లు చిట్టిబాబు, బొల్లు తాతాజీ, ఇంధన ఏసుబాబు, నాగులాపల్లి ఏసు ఉన్నారు.